## క్లుప్తంగా

### నేడు విద్యుత్ అంతరాయం

**రాజంపేట రూరల్ :** 33/11 కేవీ మన్నూరు ఫీడర్ నందు గురువారం మరమ్మతులు చేపడుతున్నందు వలన విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని నార్త్ ఏఈ వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎర్రబల్లి, మన్నూరు, సాయినగర్, రాజునగర్, మన్నూరు బైపాస్‌తో పాటు పరిసర ప్రాంతాలలో ఉదయం 7 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### డాక్టర్ సుబ్బారావుకు ఎక్సలెన్స్ అవార్డు

**రాజంపేట :** ఏయూకు చెందిన డా.సుబ్బారావుకు మీరట్‌లోని ఆరాధ్య ఏక్ ఎహ్సాస్ ఫౌండేషన్ ప్రకటించిన గురు ఎక్సలెన్స్ అవార్డ్‌ను అందుకున్నారు. బుధవారం అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి డా.సుబ్బారావును అభినందించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ డా.సాయిబాబారెడ్డి, సహచర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

**నందలూరు :** రాష్ట్రంలో వైద్యాధికారులు చేస్తున్నటువంటి రాష్ట్రవ్యాప్త సమ్మెకు మద్దతుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ బుధవారం విధులకు హాజరయ్యారు. వైద్యాధికారుల డిమాండ్లు నెరవేరే వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలియజేశారు.

### తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించాలి

**రాయచోటి టౌన్ :** జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీ టూరిజం అధికారి నాగభూషణం అన్నారు. బుధవారం రాయచోటిలోని పలు ప్రధాన వీధులలో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం జీఎస్టీ-2.0 సంస్కరణ తీసుకొచ్చారన్నారు. తగ్గిన వస్తువుల ధరలు ప్రజలకు తెలియజేసి ఎంత మేర లాభం చేకూరేది వివరించాలన్నారు. జీఎస్టీ తగ్గింపులపై ప్రజలకు అవగాహన పెంచేందుకు జనసందోహనం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు, ఆలయాలు, పింఛా ప్రాజెక్టు వద్ద పెద్దపెద్ద బ్యానర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, డీఈఓ, డ్వామా పీడీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తల కుటుంబాలకు అండగా వైఎస్సార్‌సీపీ



చంద్రమోహన్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న కొల్లం గంగిరెడ్డి

**రాజంపేట రూరల్ :** కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తూ వారి వెన్నంటే వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, రైతు చిన్నిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. చంద్రమోహన్‌రెడ్డి మృతితో వారి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద బోరున విలపిస్తున్న వారి కుటుంబ సభ్యులను ఆకేపాటి ఓదార్చారు. పుల్లంపేట మండలం అనంతసముద్రం పంచాయతీలోని పాపక్కగారిపల్లిలో సాయంత్రం జరిగిన చంద్రమోహన్‌రెడ్డి అంత్యక్రియలలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

### 16,17న శిక్షణా తరగతులు

**పెనగలూరు :** మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ అసిస్టెంట్లకు ఈనెల 17, 18వ తేదీలలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలపై అవగాహన కల్పించనున్నట్టు తెలియజేశారు.

# ప్రతిపాదనలకే పరిమితం.. ప్రమాదాలే నిత్యం!

- ముందు జాగ్రత్తలు తీసుకోకుంటే తీవ్ర నష్టం
- కాజ్‌వేల వద్ద భద్రత లేక వెక్కిరిస్తున్న రహదారులు
- చర్యలు చేపట్టాలంటూ వాహనదారుల వినతి
- నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తున్న ప్రభుత్వం

**నదులకు అడ్డంగా నిర్మించిన కాజ్ వేల వద్ద భద్రత కరువైంది. గతంలో వచ్చిన వరదల సమయంలో జరిగిన ప్రాణ నష్టాలను లెక్క చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. అవసరమైన చోట, నిర్మించాల్సిన భద్రతా నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ఆర్ అండ్ బీ అధికారులు ప్రతిపాదనలు పంపినా, ప్రభుత్వం వాటిని మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోసారి ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరగక ముందే భద్రతా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.**



రాయచోటి-సుండుపల్లె రహదారిలోని సద్దికోళ్ల వంక వద్ద ఎటువంటి రక్షణలేని కాజ్‌వే

**రాయచోటి అర్బన్ :** రహదారులు, భవనాల శాఖ అధికారులు చేయాల్సిన ముఖ్యమైన పనులను ప్రతిపాదనలతో సరిపెట్టేస్తున్నారు. వరదల సమయంలో నదుల్లో ప్రవహించే నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన వంతెనలు, కాజ్ వేల వద్ద భద్రత కరువైంది. పలు సందర్భాలలో రాయచోటి నియోజకవర్గంలోని కాజ్ వేల వద్ద జరిగిన వరద ప్రమాదాలతో ప్రాణ నష్టం కూడా సంభవించింది. అయితే నష్టం చవిచూసిన తరువాత కూడా ఆయా రహదారుల్లోని కాజ్ వేల వద్ద భద్రతా నిర్మాణాలు చేపట్టకపోవడం వెనుక అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్యం కచ్చితంగా కనిపిస్తోంది. రాయచోటి మండలంలోని గొర్లముదివీడు గ్రామ పంచాయతీ సమీపంలో మాండవ్య నదికి అడ్డంగా నిర్మించిన రహదారి పలుమార్లు వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఆ రహదారి నిర్మాణానికి శాశ్వత పరిష్కారం ఇంత వరకు దొరకలేదు. చిన్నమండెం మండల పరిధిలోని మల్లూరు వద్ద, వండాడి గ్రామ పరిధిలోని ప్రవహిస్తున్న మాండవ్య నదికి అడ్డంగా కాజ్ వే నిర్మించారు. కానీ రెండు చోట్ల కూడా భద్రతా చర్యలు చేపట్టలేదు. దీంతో వండాడి వద్ద మాండవ్య నది పైన ఉన్న కాజ్ వేపై జరిగిన ప్రమాదంలో గతంలో ఇద్దరు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు. రాయచోటి పట్టణం



ఎటువంటి భద్రతలేక మల్లూరు వద్ద మాండవ్య నదిపై ప్రమాదకరంగా ఉన్న కాజ్ వే

నుంచి సుండుపల్లె, రాజంపేటకు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న సద్దికోళ్ల వంక కాస్త వర్షం కురిసినా వరద ప్రవాహం అధికంగా ఉంటుంది. అక్కడా ఎటువంటి భద్రతా నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**ముందు జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణ నష్టం**

రాయచోటి డివిజన్‌లోని కాజ్ వేలు, నదులపై నిర్మించిన రోడ్డు మార్గంలో భద్రతా నిర్మాణాలు చేపట్టకపోతే అనుకోకుండా వచ్చే వరదల సమయంలో తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అత్యవసరంగా నిర్మించాల్సిన ప్రొటెక్షన్ వాల్స్‌కు తగిన నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం**

మల్లూరు, వండాడి, గొర్లముదివీడు గ్రామాల వద్ద మాండవ్య నదికి అడ్డంగా ఉన్న రహదారులకు భద్రతా నిర్మాణాల కోసం రూ.14 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. రాయచోటి డివిజన్ వ్యాప్తంగా మొత్తం 18 చోట్ల కాజ్ వేల వద్ద భద్రతా నిర్మాణాల కోసం, వంతెనల కోసం సుమారు రూ.80 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపడం జరిగింది. అలాగే గాలివీడు రోడ్డు మార్గంలోని ముసలిరెడ్డిగారిపల్లె వద్ద రెండు కల్వర్టుల నిర్మాణానికి రూ.40 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతానికి గుర్రంకొండ - గాలివీడు రోడ్డు మార్గంలో 6 కిలోమీటర్ల దూరం రహదారికి రూ.4 కోట్లు, రాయచోటి మండలంలోని శెట్టివారిపల్లె రహదారిలో 400 మీటర్లకు రూ.70 లక్షలు, చిన్నమండెం మండలంలోని బోనమల - కలిబండ రహదారిలో 14 కిలోమీటర్లకు రూ.4 కోట్లు మంజూరు అయ్యింది. ఈ పనులు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి.

– జి. వెంకట సుబ్బయ్య, డీఈ, ఆర్ అండ్ బీ, రాయచోటి డివిజన్

### నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

**రాయచోటి టౌన్ :** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు రాయచోటి విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాయచోటి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.యుగంధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అదాలత్‌లో వినియోగదారులు బిల్లుల సమస్యలు, మీటర్ మార్పులు, వోల్టేజ్ సమస్యలు, లైన్‌షిఫ్ట్ వంటి సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చున్నారు. ఈ అదాలత్‌లో చైర్‌పర్సన్ రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు జి.మధుకుమార్, సాంకేతిక సభ్యులు ఎ.శ్రీనివాస బాబు, స్వతంత్ర సభ్యులు డబ్ల్యూ.విజయలక్ష్మి ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

### 20న సామూహిక ధనలక్ష్మీ పూజ

**రాజంపేట టౌన్ :** దీపావళి పండుగను పురస్కరించుకొని ఈనెల 20వ తేదీ రాత్రి 8:30 గంటల నుంచి అమ్మవారిశాలలో ధనలక్ష్మీ పూజను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సామూహిక వివాహ సంస్థ ప్రతినిధి ననిశెట్టి నవీన్‌కుమార్ తెలిపారు. అమ్మవారిశాలలో బుధవారం ధనలక్ష్మీ పూజ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నవీన్ మాట్లాడుతూ ప్రజలందరికి ధనలక్ష్మీదేవి ఆశీస్సులతో సిరిసంపదలు కలగాలని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నటకల రామకృష్ణ, తల్లం శ్రీనివాసులు, పబ్బతి జగన్ పాల్గొన్నారు.

## సీమ అభివృద్ధిపై ప్రధాని స్పష్టతివ్వాలి

**లక్కిరెడ్డిపల్లి :** కర్నూలు వేదికగా జరిగే సభలో ప్రధాని నరేంద్ర మోడీ సీమ అభివృద్ధిపై స్పష్టత ఇవ్వాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విభజన చట్టంలో పేర్కొన్నట్టు సీమ అభివృద్ధికి తీసుకునే చర్యలను ప్రజలకు తెలపాలన్నారు. కడప - బెంగళూరు రైల్వే లైన్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారో సమాధానం చెప్పాలని కోరారు. పీపీపీ పేరుతో కూటమి ప్రభుత్వం చేపడుతున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటైన రాయలసీమ అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ప్రణాళికలను తెలియజేసి చిత్తశుద్ధి చాటాలన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించకుండా



మాట్లాడుతున్న సిద్దిగాళ్ల శ్రీనివాసులు

మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసాలను కప్పిపుచ్చుకోకుండా, సీమ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, పరిశ్రమల ఏర్పాటుకు, వలసల నిర్మూలనకు ఏ చర్యలు తీసుకుంటారో తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఓబులేశు, జగదీష్, జగన్ బాబు, సుదర్శన్, హరి తదితరులు పాల్గొన్నారు.

## జీవన ఎరువులతో భూసారం పెంచుదాం

**ఒంటిమిట్ట :** పంట సాగుకు రైతులు రసాయన ఎరువులు అధికంగా వాడుతున్నారని, దీంతో భూ సారం తగ్గిపోతుందని ఉటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.అంకయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని నరసన్నగారిపల్లి గ్రామంలో ఆయన జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి కోసం విచక్షణారహితంగా పురుగు మందులు, ఎరువుల వాడకం వలన నేల నిస్సారమై, నీటి, పర్యావరణ కాలుష్యం జరిగి అనేక అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. కాబట్టి ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పిలుపుని



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చ్చిన జీవన ఎరువుల అవగాహన వారోత్సవాలలో భాగంగా రైతులకు జీవన ఎరువులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.మంజుల, కృషి విజ్ఞాన కేంద్ర విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టి.మహేష్ బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

- సంక్షేమం ఇస్తామని చెప్పి కల్తీ మద్యం విక్రయిస్తున్నారు
- రచ్చబండ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

**రైల్వేకోడూరు అర్బన్ :** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ఉన్నత లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్మిస్తే సీఎం చంద్రబాబు వాటిని అమ్మేసుకోవడం దుర్మార్గమని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి విమర్శించారు. బుధవారం ధర్మాపురంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కోటి సంతకాల సేకరణ ఆవశ్యకతను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పణ్ణంగా పెట్టడమే కాక సొంత పార్టీ నాయకులతో కల్తీ మద్యం తయారు చేయిస్తూ పేదల ప్రాణాలను చంద్రబాబు హరిస్తున్నారని మండిపడ్డారు. తీసుకొచ్చిన అప్పులు కూడా అనుయాయులకు దోచిపెడుతున్నారని వాపోయారు. గత ప్రభుత్వంలో పేద, మధ్య తరగతితోపాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్



రచ్చబండలో ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

రెడ్డి పని చేస్తే, నేడు అన్ని వర్గాలను నయవంచన చేస్తూ చంద్రబాబు అధికారం అనుభవిస్తున్నారని చెప్పారు. జగన్ కంటే ఎక్కువ సంక్షేమం ఇస్తామని చెప్పిన వారు కల్తీ మద్యం ఇచ్చారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను, సోషల్ మీడియా యాక్టివిస్టులను వేధించడమే కాక ప్రజలపై కూటమి నాయకుల దౌర్జన్యాలు నానాటికీ పెరిగిపోయాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, బుడుగు శివయ్య, సుబ్బరామరాజు, సిద్దయ్య, దార్ల చంద్రశేఖర్, హరికృష్ణారెడ్డి, రమణ, శంకరయ్య, ఆనంద్‌యాదవ్, బత్తల సుబ్రమణ్యం, డీపీ రమణ, గణేష్, చైతన్య, శ్రీరాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సురక్ష యాప్‌తో అక్రమ మద్యం అరికడదాం

**రాయచోటి టౌన్ :** ప్రతి మద్యం దుకాణంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేశాకనే మద్యం విక్రయించాలని రాయచోటి ఎక్సైజ్ శాఖ సీఐ గురుప్రసాద్ తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని పలు మద్యం షాపులు, బార్లలో నౌకర్లు, యజమానులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతి సీసాను ఈ యాప్ ద్వారా స్కాన్ చేసిన తరువాతనే అమ్మాలని సూచించారు.

## ప్రభుత్వ ప్రోత్సాహంతోనే బెల్టుషాపుల నిర్వహణ

**పుల్లంపేట :** ప్రభుత్వ ప్రోత్సాహంతోనే గ్రామ గ్రామాన బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని మండల పరిషత్ అధ్యక్షుడు ముద్దా బాబుల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపుల పేరుతో టీడీపీ నాయకులు తయారు చేసిన కల్తీ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్వాహకులకు అండగా నిలుస్తున్నట్లు ఆరోపించారు. మండలంలో దాదాపు 2 వందల బెల్టుషాపులు ఉన్నాయన్నారు. మండల సమావేశానికి ఎక్సైజ్ సీఐ రాకపోగా కానిస్టేబుల్‌ను పంపడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు పోతుంటే పట్టించుకోకపోగా వ్యాన్‌ల ద్వారా మద్యం సరఫరా చేయిస్తున్నారన్నారు. అలాగే సమావేశానికి రెవెన్యూ అధికారులు హాజరుకాకపో



సమావేశంలో మాట్లాడుతున్న బాబుల్ రెడ్డి

వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంత సముద్రం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు. 328, 329లలో 3.70 ఎకరాలు పేదల భూమిని, వంద ఎకరాల భూస్వామి ఆక్రమించుకుంటే తహసీల్దార్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. జాయింట్ కలెక్టర్ నుంచి ఆర్డర్స్ ఉన్నప్పటికీ తహసీల్దార్‌లో చలనం లేదన్నారు. రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి మాట్లాడుతూ 2016లో మార్కెట్ కమిటీని డీనోటిఫై చేయడం వలన ఆదాయం తగ్గిందని, ప్రస్తుతం కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ జయశ్రీ మాట్లాడుతూ కొన్ని గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమస్యలు ఉన్నాయని తెలిపారు. చెత్త బిల్లులు గ్రామ పంచాయతీలకు వారంలో చెల్లిస్తామన్నారు. ఉపాధి ఏపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు రాక పనులు లేక గతంలో ప్రథమ స్థానంలో ఉన్న జిల్లా నేడు 12వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. తదుపరి హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఒక్క ఇండ్లు కూడా మంజూరు కాలేదన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 22 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టీచర్లు సర్దుబాటు చేయడం కష్టంగా ఉందన్నారు. మేలు జాతి పశువులను పాడి రైతులు ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేసినా బిల్లులు చెల్లిస్తామని ఆ శాఖ అధికారులు తెలియజేశారు. మండలానికి ఎంపీ ల్యాడ్స్‌తో 17, జెడ్పీ నిధులతో తొమ్మిది పనులకు నిధులు విడుదలయ్యాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎడబల్లిలో పశు వైద్య శిబిరం

**వీరబల్లి :** మండలంలోని ఎడబల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా పశు సంవర్ధకశాఖ రాయచోటి ఉప సంచాలకులు డాక్టర్ డి.మాలకొండయ్య ఆధ్వర్యంలో సిబ్బంది 35 ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 83 పశువులకు పిడుదుల నివారణ మందు పిచికారీ చేసి అందించారు. అలానే 350 గొర్రెలకు, 35 దూడలకు నట్టల నివారణ మందు, 89 సాధారణ చికిత్సలు చేసి సంబంధిత రైతులకు ఎముకలపొడి మినరల్ బ్లాక్ ఉచితంగా పంపిణీ చేశారు.

### 'బార్‌లా టీటీడీ కల్యాణ మండపం'

**రాజంపేట :** రాజంపేట టీటీడీ కల్యాణ మండపం బార్‌లా మారిపోయిందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పూల భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కల్యాణ మండపం నడపడంలో టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. దీంతో వాచ్‌మెన్ గదిలో మద్యం సేవించిన కొందరు మద్యం బాటిళ్లతో దాడులు చేసుకున్నారన్నారు. ఇందుకు కారణమైన వారికి ఒకరికి అత్తిరాల దేవస్థానం కమిటీలో సభ్యునిగా నియమించడం దారుణమన్నారు. మేనేజరు లోకల్‌గా ఉన్న షామియానా నిర్వాహకునికి బాడుగకు ఇచ్చారన్నారు. మండపాన్ని ప్రైవేటు వ్యక్తులకు మెయింటెన్ కోసం ఇస్తే దాన్ని ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారన్నారు. టీటీడీ నిధులతో నిర్మితమైన కల్యాణమండపం లక్ష్యం పక్కదారి పడుతోండటం దారుణమన్నారు.

### శుభ్రతతోనే ఆరోగ్యం

**సిద్దవటం :** విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని పి.కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి సూచించారు. బుధవారం సిద్దవటం ఎగువపేటలోని ఎంపీపీ పాఠశాలలో ఆమె ఆధ్వర్యంలో 1-5వ తరగతుల విద్యార్థులకు శుభ్రత, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, వెంకటసుబ్బయ్య, అంజనమ్మ, శారద, ఉపాధ్యాయులు శ్రీధర్, మనోరమ, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**కడప ఎడ్యుకేషన్ :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు, నోడల్ ఆఫీసర్ ఆర్‌వి కృష్ణకిషోర్ సూచించారు. నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కడపలోని స్పిరిట్ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది యువత మత్తుపదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. పునరావాసం అధికారి శ్రీకాంత్ .. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం పై జరిగే నష్టాల గురించి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈగల్ టీం అధికారి అయుబ్ ఖాన్ మాట్లాడుతూ మత్తు వ్యసనాలకు ఎవరైనా అలవాటుపడినట్లు తెలిస్తే 1972 కి కాల్ చేసి తెలపాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు అనే ప్రతిజ్ఞను చేయించారు.

## పౌష్టికాహారంతో పాటు పరిశుభ్రత తప్పనిసరి

**సిద్దవటం :** గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి అని మాచుపల్లి అంగన్వాడీ కార్యకర్త వసుంధరదేవి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండలం మాచుపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారాలను అందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. గర్భం దాల్చిన ప్రతి మహిళ పౌష్టికాహారం, ఆకుకూరలు, పాలు గుడ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పిల్లలకు తినుబండారాలు తినిపించకూడదన్నారు.



శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

అలానే పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని, పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే కార్యక్రమాన్ని చేపట్టారు.

## కీటకజనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

**ఒంటిమిట్ట :** ప్రజలు కీటకజనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నరవకాటిపల్లి సచివాలయంలో ఆయన కీటకజనిత వ్యాధుల గురించి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ పుట్టకూడదు, పుట్టిన దోమ మనిషిని కుట్టకూడదని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే సీహెచ్‌ఓ హవిలా సీపీఆర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ భాస్కర్ రెడ్డి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు చేతులను ఎలా నీటితో శుభ్రంగా శుద్ధి చేసుకోవాలో తెలియజేశారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త వనిత, ఉపాధ్యాయుల బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

- మిస్సైల్ మ్యాన్‌కు ఘన నివాళి
- దేశానికి ఆయన చేసిన సేవలను వివరించిన ఉపాధ్యాయులు

**రాజంపేట టౌన్:** డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని మండలంలోని బోయినపల్లె పీఎంశ్రీఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి తెలిపారు. అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఆ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అబ్దుల్‌కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగానే కాకుండా అరుదైన వ్యక్తిత్వం కలిగిన మహనీయుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. దేశ అణు, శాస్త్ర సాంకేతిక రంగాలకు కలాం సరికొత్త దిశను చూపారని కొనియాడారు. కలలు కనండి.. ఆ కలలను సాకారం చేసుకోండి అని అబ్దుల్‌కలాం యువతకు ఇచ్చిన పిలుపు దేశ ప్రజలు ఎప్పటికీ మర



రాజంపేట టౌన్: బోయినపల్లెలోని జెడ్పీ హెచ్ఎస్‌లో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి

వరన్నారు. మానవత్వం, అసమాన్యమైన విజ్ఞానం, నిస్వార్థం, స్ఫూర్తివంతమైన నడవడిక కలాం సొంతమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కలాంను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు.



రైల్వేకోడూరు: అబ్దుల్ కలాం జయంతి వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు

తొలుత అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.జనార్దన్, బి.శేషగిరి, శివప్రసాద్‌గౌడ్, ఎస్.ప్రభాకర్ రావు, పి.విజయభాస్కర్, ప్రణవి, ఎస్.రా



ఓబులవారిపల్లె: అబ్దుల్ కలాం చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయుల నివాళి

జయ్య, శ్రీరాములు, సువర్ణ సుందరి దార్ల శ్రీనివాసులాచారి తదితరులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు :** రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి అధ్యక్షతన ప్రపంచ విద్యార్థుల దినోత్సవం, ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్షిపణి రంగంలో ఏపీజే అబ్దుల్ కలామ్ చేసిన సేవలు, అలాగే భారత రాష్ట్రపతిగా దేశానికి చేసిన సేవలు గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

**ఓబులవారిపల్లె :** భారత మాజీ రాష్ట్రపతి, అంతరిక్ష శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలామ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ యువరాజ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాల నందు అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.